www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 7 మార్చి 2025

నీటిగుంట తవ్వకం పనుల పరిశీలన

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉపాధి హామీ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని మొగల్తూరు, రామన్నపాలెం, కెపి పాలెం తదితర గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి వాళ్లు సూచనలు చేశారు. మండలంలో 20 మంది రైతుల భూములలో 12 చోట్ల నీటి గుంటలో తవ్వుతున్నామని ఆయన తెలిపారు. ఆయన వెంట ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ వి.ఆనంద్, టెక్నికల్ అసిస్టెంట్ జవ్వాది వెంకటేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు ఉన్నారు.

తవ్వకం పనులను పరిశీలిస్తున్న పీడీ

బాలుడి 'డెత్' మిస్టరీ..?

సిసిఎస్ పోలీసులే కొట్టి చంపారంటున్న తల్లిదండ్రులు, బంధువులు

చోరీ కేసులో తీసుకెళ్లి శవంగా పంపారంటూ ఆరోపణలు

ఏలూరు సర్వజన ఆసుపత్రి వద్ద తల్లిదండ్రుల ఆందోళన

అనుమానాలకు తావిస్తున్న బాలుడి ఒంటిపై దెబ్బలు

నోరువిప్పని పోలీసులు

పోస్టుమార్టం పూర్తి, మృతదేహం అప్పగింత

ఎఫ్ఐఆర్‌లో మరోలా నమోదు..

ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, స్పోర్ట్స్

ఏలూరులోని చేపలతూము సెంటర్‌కు చెందిన ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన మైనర్ బాలుడి డెత్ మిస్టరీ పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. ద్విచక్ర వాహనాల చోరీ కేసులో విచారణకు తీసుకెళ్లిన బాలుడు శవంగా ఎలా మారాడన్న ప్రశ్నకు సమాధానం లేకుండా పోయింది. పోలీసులు కొట్టిన దెబ్బలకే అతను చనిపోయాడంటూ తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తుండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. విచారణపేరుతో రోజుల తరబడి పోలీసులు అతన్ని ఎందుకు బంధించారు. తమ కుమారుడిని చూపించాలంటూ తల్లిదండ్రులు వేడుకున్నా ఎందుకు చూపించలేదన్న ప్రశ్నలకు సమాధానాలు లేకుండా పోయాయి. బాలుడి మృతి మిస్టరీపై పోలీసుల మౌనం మరిన్ని అనుమానాలకు తావిస్తూ, జనాల్లో చర్చనీయాంశంగా మారింది.

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో పోలీసులు తీసుకువెళ్లిన ఏలూరు చేపల తూం సెంటర్ రెల్లిపేటకు చెందిన బంగారు యశ్వంత్(17) అనే బాలుడు అనుమానస్పదంగా మృతి చెందడం గురువారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. తమ కుమారుడిని పోలీసులే చంపారంటూ తల్లిదండ్రులు బంధువుల ఆరోపిస్తే ఏలూరు సర్వజన ఆసుపత్రి వద్ద ఆందోళన దిగిన పరిస్థితి నెలకొంది. బాలుడి డెత్ మిస్టరీలో పోలీసులపై ఆరోపణలు రావడంతో విచారణ జరుగుతుందా లేదా అన్న అనుమానాలు నెలకొన్నాయి. తల్లిదండ్రులు బంగారు శివ, వనిత, బంధువుల కథనం ప్రకారం.. మృతుడు బంగారు యశ్వంత్ పదో తరగతి చదువుతున్నాడు. త్వరలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయాల్సి ఉంది. నాలుగు రోజుల క్రితం రాత్రిపూట ఇంటికి పోలీసులు వచ్చి తమ మనవడు యశ్వంత్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు నాయనమ్మ చెబుతోంది.

యశ్వంత్ మృతదేహం

ద్విచక్రవాహనాల చోరీ కేసులో అతనిని తీసుకెళ్తున్నట్లు పోలీసులు తెలిపారని చెబుతోంది. అతనితోపాటు మరో ముగ్గురిని సైతం పోలీసులు తీసుకెళ్లిన్నట్లు చెబుతున్నారు. ఏ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారో తెలీక తర్వాత రోజు తల్లిదండ్రులు, బంధువులు అన్ని పోలీస్‌స్టేషన్లు తిరగ్గా చివరికి సిసిఎస్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్నట్లు తమకు సమాచారం తెలిసిందన్నారు. అక్కడకు వెళ్లి ఆరా తీస్తే మీ కుమారుడికి ఏమీ కాదని విచారణ చేసి తర్వాత పంపిస్తామని, భోజనం పెడతామని, రిమాండ్ చేస్తామని, పోలీసులు తెలిపారని తల్లి చెబుతోంది. మూడు రోజుల తర్వాత గురువారం ఉదయం ఆసుపత్రికి తమ కుమారుడు శవంగా ఎలా వచ్చాడో చెప్పాలంటూ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. తమ మనుమడు ఆసుపత్రిలో చనిపోయి ఉన్నట్లు కొందరు గుర్తించి తమకు సమాచారం అందించారని వెంటనే తాము ఆసుపత్రికి వచ్చి చూసుకోగా అక్కడ తమ మనవడు మతి చెంది ఉన్నాడని వారు కన్నీరుమున్నీరయ్యారు. సిసిఎస్ పోలీసులే తనకుమారుడిని చంపేశారంటూ యశ్వంత్ తండ్రి శివ ఆరోపిస్తున్నారు. సిసిఎస్ పోలీస్ స్టేషన్లో ఉండాల్సిన తమ కుమారుడు ఆసుపత్రిలోకి ఎలా వచ్చాడో.. ఎలా చనిపోయి పడి ఉన్నాడో చెప్పాలంటూ ఆసుపత్రి బయట బాలుడి తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. తమ కుమారుడు ఎక్కడ ఉన్నాడో ఒక్కసారి చూపించాలని బతిమాలినా చూపించలేదంటూ తల్లి వనిత కన్నీరుమున్నీరుగా విలపించడం అందరినీ తీవ్ర ఆవేదనకు గురిచేసింది. తమకు న్యాయం జరిగే వరకూ తాము పోరాటం చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్‌పి వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తామని మతుడి తండ్రి శివ తెలిపారు. ప్రస్తుతం కుమారుడు ఒంటిపై ఉన్న దెబ్బలే అతని పోలీసులు చంపారు అనడానికి నిదర్శనమని కూడా తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకూ పోలీసులు ఈ ఘటనపై స్పందించకపోవడం పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. పెదవేగి మండల పరిధిలోని పంటకాలువ దగ్గర బాలుడి మృతదేహం ఉందని తొలుత గుర్తించెవరు? అక్కడ నుంచి అంబులెన్స్‌లో ఎవరు తరలించారు. అంబులెన్స్‌కు ఫోన్ చేసిందెవరు? అన్న సందేహాలకు మాత్రం సమాధానం దొరకడం లేదు. బాలుడి మృతికి సంబంధించి ప్రతి అంశం మిస్టరీగా కనిపించడంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయి. ముందు పోస్టుమార్టం లేకుండా మృతదేహాన్ని పంపిచేస్తారంటూ ప్రచారం సాగినప్పటికీ సాయంత్రం ఆరుగంటలకు బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

జిల్లా కలెక్టర్ వద్ద కన్నీరుమున్నీరు

బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించడానికి సర్వజన ఆసుపత్రికి వచ్చిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి వద్దకు వెళ్లిన బాలుడి తల్లిదండ్రులు, బంధువులు తమ కుమారుడిని పోలీసులు చంపేశారంటూ ఘొల్లుమన్న పరిస్థితి నెలకొంది. దీనిపై విచారణ చేయిస్తానని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.

సాయంత్రానికి ఎఫ్ఐఆర్ నమోదు

బాలుడు యశ్వంత్ మృతికి సంబంధించి పెదవేగి పోలీస్ స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఎఫ్ఐర్ నమోదైంది.పోలవరం కాలువ గట్టు వద్దకు బహిర్భూమికి వెళ్లి స్పృహతప్పి పడిపోయినట్లుగా చూసినవారు కుటుంబసభ్యులకు సమాచారం అందించారని, గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించినట్లు, గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు బాలుడి అన్న బంగారు కృష్ణవర్ధన్ పెదవేగి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు చేసినట్లు తెలిసింది. ఉదయం ఆసుపత్రి వద్ద బాలుడి తల్లిదండ్రులు, బంధువులు మాట్లాడినదానికి, సాయంత్రం ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై పొంతన లేకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. దీని వెనుక ఏదో జరిగిందన్న బలమైన అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. బాలుడి మృతి మిస్టరీ తేలుస్తారో లేదో చూడాల్సి ఉంది.

సమస్యలపై ప్రజా చైతన్య సైకిల్ యాత్ర

8 నుంచి 16వ తేదీ వరకూ నిర్వహణ

17న భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష కుటుంబాల వారు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు, ప్రభుత్వం కాలనీలో మౌలిక వసతులు వంటి సమస్యలతో సతమతమవుతున్నారని, ఈ నేపథ్యంలో నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఎం ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలనే ముఖ్యోద్దేశంతో ప్రజా చైతన్య జిల్లా సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. జిల్లాలో ఈ నెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా 500 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర సాగుతుందని తెలిపారు. స్థానిక మెంటేవారి తోటలోని సుందరయ్య భవనంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావుతో కలిసి జిల్లా కార్యదర్శి గోపాలన్ మాట్లాడారు. జిల్లాలో భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు పట్టణాల్లో 20,784 టిడ్కో ఇళ్లు నిర్మించారని తెలిపారు. వీటిలో కేవలం 8,736 మంది లబ్ధిదారులకు మాత్రమే గృహాలు కేటాయించారన్నారు. కేవలం 40 శాతం మందికి మాత్రమే ఇచ్చారన్నారు. ఇక్కడ కనీస మౌలిక వసతులు కల్పించకపోవడంతో 50 శాతం మంది లబ్ధిదారులు తిరిగి వెళ్లిపోయారని చెప్పారు. అలాగే 9,430 మందికి బ్యాంకు రుణాలు మంజూరు చేస్తే కేవలం 2000 మందికి మాత్రమే రుణాలు అందించారని తెలిపారు. దీంతో ఎన్‌పిఎ వారి ఆస్తులు మారిపోయాయన్నారు. ఒకపక్క బ్యాంకు రుణాలకు వాయిదాలు, మరో పక్క ఇంటి అద్దె చెల్లించలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో 1532 ఎకరాలను కొనుగోలు చేసి 649 ప్రభుత్వ లేఅవుట్లను ఏర్పాటు చేశారని, ఈ లేఅవుట్లలో సుమారు 64,315 మంది లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారని తెలిపారు. అయితే ఈ లేఅవుట్‌లో కనీసం పూడిక కూడా చేయలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో అనేక చోట్ల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదన్నారు. కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందిస్తుంటే రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలు ఖర్చవుతోందన్నారు. ప్రభుత్వం రుణాన్ని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. 2014- 2019 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకంలో సుమారు 25,855 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని పదేళ్ల గడుస్తోందన్నారు. సుమారు రూ.40 కోట్ల 78 లక్షల బకాయిలు లబ్ధిదారులకు చెల్లించాల్సి ఉందన్నారు. కుటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందని, నేటికీ ఆ హామీని నెరవేర్చలేదన్నారు. ఇళ్ల పట్టాల హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సిపిఎం నిర్ణయించి ప్రజా చైతన్య జిల్లా సైకిల్ యాత్ర చేపట్టిందని తెలిపారు. ఈ నెల 8వ తేదీన భీమవరం టిడ్కో గృహాల సముదాయాల వద్ద నుంచి జిల్లా సైకిల్ యాత్ర ప్రారంభమవుతుందన్నారు. అక్కడి నుంచి జిల్లా వ్యాప్తంగా సైకిల్ యాత్ర ఈనెల 16వ తేదీ వరకూ సాగుతుందన్నారు. అనంతరం 17వ తేదీన భీమవరం కలెక్టరేట్ వద్ద లక్ష మంది కుటుంబాల సమస్యపై భారీ ధర్నా నిర్వహించనున్నామన్నారు. ఈ ధర్నాకు పెద్ద ఎత్తున ప్రజానీకం తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నిర్దిష్ట ప్రణాళికతో పాత పెండింగ్ కేసులు పరిష్కరించాలని జిల్లాలోని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో ఎస్‌పి కార్యాలయంలో గురువారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్‌పి ముఖ్యంగా పాత పెండింగ్ గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, సాధారణ మరణాలు, పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్స్ తదితర కేసులతోపాటు డిపిఒలో వివిధ పెండింగ్ రిప్లయ్స్‌ను సమీక్షించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పాత పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడారు. పోలీస్ స్టేషన్ల వారీగా యుఐ కేసులు తగ్గించుకోవాలని, వీలైనంత త్వరగా పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకురావాలన్నారు. అరెస్టులు, ఛార్జ్ షీట్లు, సమన్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నమోదైన కేసులో సమగ్ర దర్యాప్తు నిర్వహించి నేరస్తులు తప్పించుకునే వీలు లేకుండా న్యాయ స్థానాల్లో తగిన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలన్నారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకుని ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచాలని, దొంగతనాలు, దోపిడీలు, చైన్ స్నాచింగ్ తదితర నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. రాత్రి సమయంలో రెగ్యులర్ బీట్లతో వాహనాల తనిఖీలు చేసి కట్టడి చేయాలని, రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి ఫైన్ విధించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పాటిస్తూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్‌పి వి.భీమారావు, భీమవరం సబ్ డివిజన్ డిఎస్‌సి రావూరి గణేష్ జయసూర్య, నరసాపురం డిఎస్‌పి జి.శ్రీవేద, తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ డిఎస్‌పి డి.విశ్వనాత్, సిఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ

మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

8న 600 మంది మహిళలతో భారీ ర్యాలీ - జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

మహిళల ఆర్థిక సాధికారిత, భద్రత, రక్షణ చర్యలు ఇనుమడించేలా అన్ని శాఖలు సమన్వయంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో ఈ నెల ఎనిమిదో తేదీన నిర్వహించబోయే జిల్లాస్థాయి మహిళా దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత అధికారులు, వివిధ కళాశాల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ శనివారం స్థానిక ప్రకాశం చౌక్ నుంచి ఉదయం 6:30 గంటలకు సుమారు 600 మంది మహిళలు ఫ్యాన్సీ డ్రెస్‌తో భారీ ర్యాలీని ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్లే కార్డ్స్, స్లోగన్లతో ర్యాలీ ఎస్ఆర్.నగర్ అల్లూరి సీతారామరాజు శృతివనం వరకూ సాగుతుందన్నారు. అనంతరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ శాఖల స్టాల్స్, మహిళలకు ఉపకరణాలు పంపిణీ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కేంద్ర మంత్రులు రాష్ట్ర మంత్రులు ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లకు, పురపాలక సంఘం ఛైర్మన్‌లకు, ప్రముఖులకు ఆహ్వానం పలకాలన్నారు. మహిళలకు ఉపకారణాలు అందించేదుకు లీడ్ బ్యాంకు మేనేజరు, డిఆర్‌డిఎ, మెప్మా, జిల్లా పరిశ్రమల శాఖ సమన్వయంతో పంపిణీ చేయాలన్నారు. 100 మీటర్ల దూరంలో ఒక్కొక్కటీ చొప్పున తాగునీటి క్యాన్లు, స్టీల్ గ్లాసులు ఏర్పాటుచేసి అడిగిన వారికి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాలీలో పాల్గొన్న వారికి అల్పాహారం, మజ్జిగ ప్యాకెట్లు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా ఐసిడిఎస్ అధికారి బి.సుజాతారాణి, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ, వైద్యఆరోగ్య శాఖ అధికారి బి.భానూనాయక్, జిల్లా లేబరు అధికారి ఎ.లక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి రాహుల్‌కుమార్ రెడ్డి

12న ఉపాధి కూలీల సమస్యలపై మహా ధర్నా

జయప్రదం చేయాలి : వ్యకాస జిల్లా కార్యదర్శి జె.సత్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధి హామీ సమస్యలపై మార్చి 12వ తేదీన విజయవాడలో జరిగే మహ ధర్నా జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఉపాధి హామీ కార్మికుల డిమాండ్ల సాధనకై తలపెట్టిన మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను జిల్లా కమిటీ సభ్యులు గురువారం భీమవరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీలో అదనంగా పనిదినాలు కల్పించాలన్నారు. సమ్మర్ అలవెన్స్, పే స్లిప్పులు ఇవ్వాలన్నారు. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, వలస కార్మికులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రమాదాల్లో చనిపోయిన కుటుంబానికి రూ.25 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రతి కుటుంబానికి 3 సెంట్లు ఇంటి స్థలం, రూ.6 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలన్నారు. ప్రతి దళిత కాలనీకి రెండు ఎకరాల శ్మశాన స్థలం ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ ఈనెల 12వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే మహాధర్నాను ఉపాధి కూలీలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కరపత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు, ఎడ్ల చిట్టిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు, శేషపు ఆశ్రయ్య, జిల్లా కమిటీ సభ్యులు షేక్ పాదుషా, మూడే మోజేష్, గుబ్బల నాగేశ్వరరావు, పోతుల మృత్యుంజయ పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

గీత కార్మికులకు 18 మద్యం షాపులు కేటాయింపు

478 దరఖాస్తుల ద్వారా లభించిన రూ.9 కోట్ల 56 లక్షల ఆదాయం

రెండు నెలల ఫీజు నిమిత్తం మరో రూ.95 లక్షల 83 వేలు ప్రభుత్వానికి జమ

లాటరీ తీసిన జిల్లా జాయింటు కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో గీత కులాలకు కేటాయించిన మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియ స్థానిక కలెక్టరేట్లో గురువారం జరిగింది. జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి మద్యం షాపులకు లాటరీ తీసి కేటాయింపులు చేశారు. భీమవరంలో 2 దుఖాణాలకు 90 దరఖాస్తులు, తణుకులో 5 దుఖాణాలకు 123 దరఖాస్తులు, తాడేపల్లిగూడెంలో 4 దుఖాణాలకు 124, పాలకొల్లులో 2 దుఖాణాలకు 54, నరసాపురంలో 3 దుఖాణాలకు 74, ఆకివీడులో 2 దుకాణాలకు 13 దరఖాస్తులు కలిపి జిల్లాలో 18 మద్యం షాపులకు 478 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున రూ.9 కోట్ల 56 లక్షలు నాన్ రిఫెండబుల్ కింద ఆదాయం లభించింది. ఈ మద్యం షాపుల కేటాయింపుకు జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ లాటరీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించి మాట్లాడారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడ్డ గీత కులాలు మద్యం షాపుల కేటాయింపుల కోసం లాటరీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేశారు. జిల్లాలోని 18 మద్యం షాపుల కోసం మొత్తం 478 దరఖాస్తుల దాఖలు అందాయన్నారు. ఈ 18 షాపులకు రెండు నెలల ఫీజు రూ.95,83,333 రుసుం జమచేసి షాపులను కేటాయించడం జరుగుతుందన్నారు. శెట్టిబలిజ 10, గౌడ 5, గౌడ్ 2, శ్రీశయిన 1 షాపులను కేటాయించడం జరిగిందని తెలిపారు. మొత్తం 478 దరఖాస్తులకు గాను రూ.9 కోట్ల 56 లక్షలు నాన్ రిఫండబుల్ కింద ప్రభుత్వానికి జమ అయ్యిందన్నారు. లాటరీ నిర్వహణ ప్రక్రియలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కెవి.నాగప్రభు కుమార్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్ఎస్.కుమారేశ్వరన్, సహాయ ఎక్సైజ్ అధికారి ఆర్‌వి.ప్రసాద్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

లాటరీ తీస్తున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

వైద్య, ఔషధ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలెజెన్స్ ప్రముఖ పాత్ర

రిజిస్ట్రార్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రొపెసర్ జి.సుధాకర్

ప్రజాశక్తి - తణుకు

ఆర్టిఫీషియల్ ఇంటిలెజెన్స్ వైద్య రంగంలోనూ, ఔషద రంగంలోనూ ప్రముఖ పాత్ర పోషిస్తుందని రిజిస్ట్రార్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం ప్రొ.జి.సుధాకర్ అన్నారు. గురువారం స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా డిగ్రీ, పిజీ(అటానమస్) కళాశాలలో యుజిసి, ఐక్యూఎసి వారి ఆధ్వర్యంలో వ్యాధికారక స్వేచ్ఛ సూక్ష్మజీవులపై-ఔషద ఆవిష్కరణ, రోగ నిర్ధారణ సాధనాలపై అవగాహనపై రెండు రోజుల జాతీయ సదస్సు మొదటి రోజు కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీబాయ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ శరీరం వ్యాధినిరోధక శక్తిని ఏవిధంగా తయారు చేసుకుంటుందో, జన్యు పరీక్షలు చేయించుకోవడం వల్ల ఏ మందులు మనకు ఉపయోగపడతాయో తెలుస్తుందన్నారు. కోవిడ్ సమయంలో వ్యాధి నిరోధక టీకాలు ప్రముఖ పాత్ర పోషించాయని, మందులు వారి శరీరతత్వాన్ని బట్టి మోతాదును ఉపయోగించుకోవాలని, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ వారి నాణ్యతా ప్రమాణాలను పాటించాలని తెలియజేశారు. మేనేజర్ క్రోమోజెనిక్ లైఫ్ సైన్సు, హైదరాబాద్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ వైరస్, బ్యాక్టీరియా మనిషిని ఏవిధంగా ప్రభావితం చేస్తాయో, ఎక్కువ మొత్తంలో యాంటిబయాటిక్స్ వాడితే మూత్రపిండాలు పాడవుతాయని, లివర్, గుండె అవయవ మార్పిడి జరిగినప్పుడు యాంటిబయాటిక్స్ చక్కగా పనిచేస్తాయని, పేగులో మంచి బ్యాక్టీరియా లోపించడం వల్ల జీర్ణక్రియ సమస్యలు, రోగనిరోధక సమస్యలు వస్తాయన్నారు. పేగులో చెడు బ్యాక్టీరియా పెరిగిపోవడం వల్ల జలుబు, ఫ్లూ వంటి అంటువ్యాధులు వస్తాయని, వ్యక్తిగత పరిశుభ్రతను, మంచి పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, డాక్టర్ కె.వెంకటరెడ్డి, డాక్టర్ ఎం.శ్రీదేవి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అవగాహనా సదస్సులో ప్రొఫెసర్ సుధాకర్

'దంతాలను ఆరోగ్యంగా ఉంచుకోవాలి'

భీమవరం టౌన్ : దంతాలు బా గుంటేనే ఆహారాన్ని మంచిగా నమిలి మింగడంతో త్వరగా జీర్ణమై శక్తి వస్తుందని, దంతాలను ఆరోగ్యంగా ఉంచుకోవాలని దంత వైద్యులు డాక్టర్ ఎస్.గౌతమ్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం 32 డెంటల్ హాస్పటల్‌లో ప్రపంచ దంత వైద్య దినోత్సవం సందర్భంగా గురువారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతమ్ మాట్లాడుతూ మనదేశంలో చాలామంది ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేస్తారని, పలు వ్యాధుల ప్రారంభ సంకేతాలు, లక్షణాలను ముందుగా గుర్తిస్తే అరికట్టవచ్చునని అన్నారు. అవగాహనా లోపం, కొన్ని రకాల అపోహలతో కూడా కొంతమంది చికిత్స మానుకొని దంత సంరక్షణపై నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రస్తుతం దంత వైద్య చికిత్సలో చాలా మార్పులు వచ్చాయని, పుట్టిన పిల్లల నుంచి పెద్ద వారి వరకు దంత సమస్యలు అధికమవుతున్నాయని అన్నారు. బ్రష్ చేసుకునే విధానం, తినే ఆహారంపై సరైన శ్రద్ధ వహించకపోవడంతో దంతాలు పాడవుతున్నాయన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మానవ శరీరంలో ప్రతి అవయవం సున్నితమైనదని, నిర్లక్ష్య ధోరణితో వ్యాధి వచ్చే వరకు నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. అనంతరం 22 మందికి ఉచిత దంత వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం డాక్టర్ గౌతమ్‌ను సత్కరించారు.

డాక్టర్ గౌతమ్‌ను సత్కరిస్తున్న రంగసాయి

అధికారుల అనుమతితోనే రేవు వేలం పాట

ప్రజాశక్తి - నరసాపురం

ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున 2025-26 సంవత్సరానికి మాధవాయపాలెం ఫెర్రీ రేవు వేలంపాట నిర్వహణకు అనుమతి ఇవ్వలేదని ఎంపిడిఒ జివిఎస్.రామకృష్ణంరాజు తెలిపారు. రేవు పాటకు జిల్లా అధికారుల నుంచి అనుమతి వచ్చిన వెంటనే రేవు వేలం ప్రక్రియ నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

కేపీ పాలెంలో పశువులకు టీకాలు

మొగల్తూరు : జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గురువారం మండలంలోని కేపీ పాలెం నార్త్‌లో పశువైద్య శిబిరం నిర్వహించామని పశువైద్యాధికారిని డాక్టర్ జి.నీలిమ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని 163 పశువులకు వ్యాధి నివారణా టీకాలు వేశామని వైద్యురాలు నీలిమ తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఉన్నారు.

సరిపల్లిలో ఫ్యామిలీ ఫిజిషియన్

నరసాపురం : మండలంలోని సరిపల్లి గ్రామంలో గురువారం 104 ద్వారా ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఎల్‌బి చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎం.మాధురి ఆధ్వర్యంలో వైద్య బృందం గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సోని, హెల్త్ అసిస్టెంట్ వై.విజయ భాస్కర్, ఎఎన్ఎం పి.జయంతి, ఆశాలు ధనలక్ష్మి, మధులత పాల్గొన్నారు.

ఆదిత్యలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

తాడేపల్లిగూడెం : ఆదిత్య అంటేనే ఉద్యోగాలని ఆదిత్య డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ ఇ.లక్ష్మి సరోజ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల తాడేపల్లిగూడెం బ్రాంచిలో ప్రముఖ కంపెనీ యూరేక్స్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాలోని 5 ఆదిత్య డిగ్రీ కాలేజీ విద్యార్థులు, గుడివాడ ఆదిత్య డిగ్రీ కాలేజీల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. యు లెర్న్ సంస్థ సిఇఒ పద్మావతి అరుగుల హెచ్‌ఆర్‌లు కమ్యూనికేషన్ ఆధారిత ఇంటర్వ్యూ, 3 ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ప్యానల్స్ నిర్వహించారని, ఫలితాలను 18వ తేదీన విడుదల చేస్తారని తెలిపారు. డైరెక్టర్ ఎ.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మా ఆదిత్య ప్రతిభకే ముందు నుంచి ఉద్యోగాలు సాధించేలా ఉంటుందని, దీనికి అనుగుణంగా ట్రైనింగ్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎస్.సుగుణ రెడ్డి ఎంతగానో కృషిచేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్వ్యూకు హాజరైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు.

రోడ్లపై చెత్త కనపడకూడదు : కలెక్టర్

భీమవరం టౌన్ : ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రోడ్ల పక్కన ఎక్కడా చెత్త కనపడకూడదని జిల్లా కలెక్టర్ నాగరాణి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. భీమవరం శ్రీవిష్ణు ఇంజినీరింగ్ కళాశాలలో, డాక్టర్ బివి.రాజు ఆడిటోరియంలో జరిగిన జిల్లా పంచాయతీ కార్యదర్శుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పంచాయతీల్లోనూ మార్చి నెలాఖరు నాటికి నూరు శాతం పన్నులు వసూలు చేయాలని అన్నారు. పూర్తిగా ప్లాస్టిక్ నిషేధించడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి రోడ్ల పక్కన ఎక్కడా చెత్త కుండి ఉండకూడదు, చెత్త కనిపించకూడదని గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలలో చైతన్యం తీసుకురావాలని అన్నారు. రోడ్ల పక్కన ఇబ్బడి ముబ్బడిగా చెత్తను పారవేసి మంటలు పెడుతున్నారని, ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి చెత్త సేకరించాలని, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి వర్మి కంపోస్ట్ చేయాలన్నారు. డిపిఒ బి.అరుణశ్రీ, డిఎల్‌పిఒలు భీమవరం బాలాజీ వెంకటరమణ, నరసాపురం ఐ.జ్యోతిర్మయి పాల్గొన్నారు.

విశ్రాంత జడ్జి నెల్సన్ రాజు మృతి తీరనిలోటు

సంతాప సభలో పలువురు వక్తలు

భీమవరం : విశ్రాంత జడ్జి ఎస్‌వి.నెల్సన్ రాజు మృతి తీరని లోటని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక అంబేద్కర్ భవనంలో నెల్సన్ రాజు సంతాప సభ ఎపిఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ భీమవరం అధ్యక్షుడు కెప్టెన్ డాక్టర్ ఎ.వీరయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్సన్ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ విశ్రాంత జడ్జి ఎస్‌వి.నెల్సన్ రాజు ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘ కాలం పనిచేశారన్నారు. ఆయన అంకిత భావానికి నిదర్శనమని, వారితో అందరికీ చక్కటి అనుబంధం ఉందని, వారు కులమతాలకు అతీతంగా అనేక సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఎస్‌ఎఫ్ వ్యవస్థాపకులు డాక్టర్ గూడపాటి శాంతారావు, బహుజన జెఎసి గౌరవాధ్యక్షులు కాటం స్టాన్లీ, అధ్యక్షులు తాళ్లూరి మధు, దళిత ఐక్యవేదిక అధ్యక్షులు గంటా సుందర్ కుమార్ పాల్గొన్నారు.

దళిత సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్

ఆచంట : అసెంబ్లీలో దళితవాడల్లోని పలు సమస్యలపై సుదీర్ఘ చర్చ జరగవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత సమస్యలపై, దళితుల ఆర్థిక స్థితిగతులపై దళిత ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో గలమెత్తి వాటి సమస్యలను తీర్చేలా చర్చ జరగాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పును అసెంబ్లీలో ఎక్కువ సమయం ప్రజాసమస్యలపై పోరాటం చేసేలా ఉండాలని, అంతేగాని ప్రజాప్రతినిధులు ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా దళితవాడల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రానున్న రోజుల్లో వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి దళితవాడల్లో మంచినీరు సదుపాయం ఉండేలా ఏర్పాటు చేయాలని అన్నారు. ముఖ్యంగా దళితవాడల్లో డ్రెయినేజీ, రోడ్ల సమస్య ఎక్కువగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి ప్రతి నియోజకవర్గంలో ఎంఎల్‌ఎలు కృషి చేయాలన్నారు.

రేషన్ షాప్ సీజ్

భీమవరం టౌన్ : భీమవరం పట్టణంలో విజిలెన్స్, సివిల్ సప్లయీస్ అధికారులు గురువారం సంయుక్తంగా నిర్వహించిన తనిఖీలలో గునుపూడులోని రేషన్ షాప్‌ను సీజ్ చేశారు. వాహనంలోని సరుకుల వ్యత్యాసం, రేషన్ షాప్ నెం:0584096 డీలరుపై 6 ఎ కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లై ఆర్ఐ సురేష్ తెలిపారు.

మావుళ్లమ్మకు ఏడు గ్రాముల బంగారం విరాళం

భీమవరం టౌన్ : మావుళ్లమ్మ అమ్మవారికి కొలమూరుకి చెందిన కూనపరాజు బాలాజీ రాజు దంపతులు గురువారం 7 గ్రాముల బంగారం విరాళంగా అందించినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఇఒ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. బాలాజీ రాజుకు ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించి, శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

మొగల్తూరులో అన్నదానం

మొగల్తూరు : మండలకేంద్రం మొగల్తూరులోని కోట రోడ్‌లో ఉన్న దత్తసాయి మందిరంలో గురువారం అన్నసమారాధన చేశారు. యాత్రికులు బాబా వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దత్తసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఎంఎల్‌సి దువ్వాడ శ్రీనివాస్‌పై జనసేన నేతల ఫిర్యాదు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై వైసిపి ఎంఎల్‌సి దువ్వాడ శ్రీనివాస్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పాలకొల్లు పోలీస్ స్టేషన్‌లో జనసేన నేతలు బుధవారం ఫిర్యాదు చేశారు. గతనెల 24న దువ్వాడ శ్రీనివాస్ మీడియా సమావేశంలో పవన్ కళ్యాణ్‌పై అసత్య ఆరోపణలు చేసారని, సిఎం చంద్రబాబు పవన్ కళ్యాణ్‌కి నెలకు రూ.50 కోట్లు ఇస్తున్నట్లు, అందుకే పవన్ కళ్యాణ్ నోరు విప్పడం లేదని దీనిపై పట్టణ ఎస్ఐ పృథ్వీకి జనసైనికులు ఫిర్యాదు చేశారు. ప్రశాంతంగా ఉన్న ఎపిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎంఎల్‌సి దువ్వాడ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. భారతీయ కాపు సేవా సమితి జాతీయ అధ్యక్షులు కాలవ వెంకటేశ్వరరావు(కన్నా), జాతీయ మహిళా అధ్యక్షురాలు వన్నెంరెడ్డి భవాని, పాలకొల్లు నియోజకవర్గ అధ్యక్షులు పినిశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొమ్ముల దినేష్, ఉపాధ్యక్షులు నేదునూరి నరసింహారావు పాల్గొన్నారు.

బండి ముత్యాలమ్మ సన్నిధిలో కొత్తపల్లి

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై చౌకబారు ఆరోపణలు చేయడం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తగదని కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. మండలంలోని ముత్యాలపల్లిలో గ్రామాల్లో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారిని గురువారం సాయంత్రం ఆయన దర్శించుకున్నారు. ఆయనతో పాటు ముక్కు పుల్లయ్య నాయుడు, దొంగ స్వామి, కర్రి వీరాస్వామి, దూసనపూడి కోటి, కొప్పర్తి శీను, దేశంశెట్టి శ్రీను, సాధనాల చిన్ని, బర్రి రామస్వామి ఉన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ప్రణాళికతో నీటి ఎద్దడిని ఎదుర్కొంటాం

ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఎ.ఫణి

చిట్ - చాట్

ప్రజాశక్తి - కాళ్ల

వేసవిలో తాగునీటి సమస్యను పక్కా ప్రణాళికతో అధిగమిస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ అమిరపు ఫణి తెలిపారు. మండలంలో ప్రతి ఇంటికి కుళాయి బిగించి రక్షిత తాగునీరు అందించడం తమ శాఖ లక్ష్యమన్నారు. భవిష్యత్తులో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రణాళికలు అమలు చేస్తున్నామని ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : ఈ వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎలాంటి ప్రణాళికతో ముందుకెళ్తున్నారు?

ఎఇ : ఇప్పటికే వేసవి ప్రణాళికను రూపొందించాం. ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు, పలువురు దాతల సహకారంతో తాగునీటి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తున్నాం.

ప్రశ్న : మండలంలో మంచినీటి చెరువులు, ఫిల్టర్ బెడ్లు, రక్షిత మంచినీటి పథకాలు ఎన్ని ఉన్నాయి?

ఎఇ : 21 గ్రామ పంచాయతీల్లో 35 మంచినీటి చెరువులు ఉన్నాయి. 63 ఫిల్టర్ బెడ్లు ఉన్నాయి. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ద్వారా 26 రక్షిత మంచినీటి పథకాలున్నాయి. సమగ్ర రక్షిత మంచినీటి పథకం ఒకటి బొండాడ గ్రామంలో ఉంది.

ప్రశ్న : డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఏమని ఆదేశించారు?

ఎఇ : ఎస్‌సి బోస్ కాలనీ, కోమటిగుంట, పల్లిపాలెం, మోడీ గ్రామాల్లో మైక్రో ఫిల్టర్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏలూరుపాడు, పెదఅమిరం గ్రామాల్లో మైక్రో ఫిల్టర్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు, నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

ప్రశ్న : ఇప్పటి వరకు ఎన్ని ఇళ్లకు జలజీవన్ మిషన్ ద్వారా కుళాయిలను బిగించారు?

ఎఇ : మండలంలో 68,591 మంది జనాభా 17,269 ఇల్లు ఉన్నాయి. 13,870 ఇళ్లకు కుళాయిలు బిగించారు. ఇప్పటి వరకు 600 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వడం జరిగింది.

ప్రశ్న : వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌లు ఎన్ని ఉన్నాయి?

ఎఇ : పశ్చిమగోదావరి జిల్లాకు శివారు మండలం ఉప్పుటేరు తీరప్రాంతం కావడంతో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండేది. బొండాడ గ్రామంలో రూ.10 కోట్లతో సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మించి బొండాడ, బొండాడ పేట, లక్ష్మీ నరసింహపురం, ఆనందపురం, మాలవానితిప్ప, మేకలదిబ్బ, గోగుతిప్ప ఏడు గ్రామాలతో పాటు 11 ఆవాస ప్రాంతాలకు మంచినీటి సౌకర్యం కల్పించాం. ఫ్రీ ట్రీట్మెంట్ ప్లాంట్స్ దొడ్డనపూడి, జక్కరం, సీసలి, ఏలూరుపాడు, కలవపూడి, కాళ్ల గ్రామాల్లో ఏర్పాటు చేసి స్వచ్ఛమైన నీరు అందిస్తున్నాం.

ప్రశ్న : పిఎంఎవై-ఎన్‌టిఆర్ నగర్‌లో పైప్ లైన్ పనులు చేపట్టారా?

ఎఇ : ఏలూరుపాడు, కోపల్లె, కాళ్ల, బొండాడపేట గ్రామాల్లో హౌసింగ్ ఇళ్లకు పైపు లైన్ ఏర్పాటు చేసి ట్యాప్ కనెక్షన్ ఇవ్వడం జరిగింది.

హైస్కూల్ ప్రారంభానికి ఏర్పాట్లు : హెచ్‌ఎం

ప్రజాశక్తి - ఉండి

వచ్చే విద్యా సంవత్సరం నుంచి తమ గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్రారంభం కానున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెన్మెత్స సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ తమ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు సుమారు 55 మంది ఉన్నారని, ఇటీవల తమ పాఠశాలకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వచ్చిన సందర్భంగా ఆమెకు తమ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరగా అందుకు కావలసిన విద్యార్థులు ఉంటే తప్పకుండా హైస్కూల్‌గా మారుస్తామని హామీ ఇచ్చారని, అందుకు కావలసిన ఏర్పాట్లు చేయాలని మండల విద్యాశాఖ అధికారికి సూచించారని వారు వివరించారు. తమ పాఠశాలలో ఉన్న విద్యార్థులకు అదనంగా మరో 20 మంది విద్యార్థులు ఉంటే హైస్కూల్‌గా మార్చేందుకు వీలవుతుందని మండల విద్యాశాఖ అధికారులు తెలపడంతో పక్కన ఉన్న ఆరేడు, కలిగొట్ల గ్రామాల నుంచి విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించాలని, తమ పాఠశాలకు వచ్చేందుకు కావాల్సిన ఏర్పాట్లను చేస్తామని వారి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి తెలపగా వారు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. తమ పాఠశాలలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు తాను సొంతంగా సంవత్సరానికి తన తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులను మెరిట్ ఆధారంగా రూ.10 వేల నగదు బహుమతి ఇవ్వడమే కాకుండా కొంతమంది దాతలు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నారని తెలిపారు. ప్రతి విద్యార్థిని ప్రత్యేక శ్రద్ధతో చదివించడం జరుగుతుందని, తమ గ్రామ పెద్దలు తమకు పూర్తి సహాయ సహకారాలు అందించడంతో గ్రామంలోని సగం మంది విద్యార్థులు తమ పాఠశాలలోనే చదువుతున్నారని, వారి కోరిక మేరకు తమ గ్రామంలో హైస్కూల్ ఏర్పాటు చేసేందుకు తాను చేయాల్సిన కృషి చేశానన్నారు. అధికారులు వచ్చే విద్యా సంవత్సరం నుంచి తమ పాఠశాలలో హైస్కూల్ తరగతులు ప్రారంభించేందుకు సుముఖంగా ఉన్నారని ఆయన తెలిపారు.



విద్యార్థుల తల్లిదండ్రులను కోరుతున్న ప్రిన్సిపల్ సత్యనారాయణ రాజు

9న మెగా జాబ్ మేళా

60 కంపెనీలకు పైగా రాక

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెదతాడేపల్లి లోటస్ హైస్కూల్లో ఈనెల 9వ తేదీన ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మెగా జాబ్ మేళా జరుగునని జనసేన తాడేపల్లిగూడెం నియోజకవర్గ యువనేత బొలిశెట్టి రాజేష్ తెలిపారు. తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా జరుగుతుందని, దాదాపు 60 కంపెనీలకుపైగా ఈ జాబ్ మేళాలో రిక్రూట్మెంట్ నిర్వహిస్తాయని గురువారం విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. వివిధ బ్యాంకులతో పాటు, సాఫ్ట్‌వేర్, ఐటి కంపెనీలు ఫార్మసీ తదితర సంస్థలలో ఉద్యోగాలకు ఈ జాబ్ మేళా మంచివేదిక కాగలదన్నారు. సుమారు వెయ్యి మందికిపైగా ఈ జాబ్ మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. 10వ తరగతి పాసైన వారు నుంచి డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఇతర సాంకేతిక వృత్తి విద్య కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారందరూ అర్హులేనన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థుల కోసం నాలుగు బస్సులు ఏర్పాటు చేశామని వివరించారు. గూడెం బస్టాండ్ సమీపం నుంచి బస్సులు లోటస్ స్కూల్‌కి జాబ్ మేళాకు బయలుదేరునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్తనపల్లి కాశి, గుండుమోగుల సురేష్, నల్లగంచి రాంబాబు, నీలపాల దినేష్, పైబోయిన వెంకటరామయ్య, మైలవరపు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సత్యప్రతాప్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం గ్రామానికి చెందిన గుడాల సత్యప్రతాప్ విద్యుత్ రంగంలో పునరుత్పాదక శక్తి, కృత్రిమ మేధస్సు వినియోగం అంశంపై మలేషియా లికన్ యూనివర్సిటీలో గౌరవ డాక్టరేట్ దక్కినట్లు గురువారం విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీ, కృత్రిమ మేధస్సు రంగానికి సంబంధించి గ్రీన్ టెక్నాలజీతో విద్యుత్ ఉత్పత్తిలో సామర్థ్యం, విశ్వసనీయత, సుస్థిరత్వం పెంచుకోవటం కోసం చేసిన పరిశోధనలకు డాక్టరేటు ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ పరిశోధనకు సహకరించిన ప్రతిఒక్కరికీ, మీ కీరిటిసేఫేస్ట్ టెక్నాలజీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరిశోధన పునరుత్పాదక ఇందన రంగాన్ని బలోపేతం చేయడానికి, పర్యావరణ అనుకూలమైన సాంకేతిక పురోగతిని సృష్టించడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలని చినఅమిరం గ్రామ పెద్దలు గొట్టుముక్కల మురళీకృష్ణంరాజు, గొట్టుముక్కల శివరాజు అన్నారు. చినఅమిరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి 125 మంది విద్యార్థులకు విలువైన పరీక్షా సామగ్రిని వారు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకుని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.అనురాధ, పివి.అన్నపూర్ణ, జె.శకుంతల, సిహెచ్.ప్రసాదరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్లే వేయండి : తారు రోడ్లు వద్దు

ఎంఎల్‌ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నా నియోజకవర్గంలో సీసీ రోడ్లు వేస్తానంటేనే అనుమతులు ఇవ్వాలని, తారు రోడ్లు వేస్తాను అంటే మాకు వద్దని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అసెంబ్లీ సమావేశంలో గట్టిగా మాట్లాడారు. ఒక్కసారి సిమెంట్ రోడ్డు వేస్తే 15 ఏళ్ల వరకు వెనక్కి చూడనవసరం లేదని, తారు రోడ్లు వేస్తుంటే బిల్లులు పెట్టుకునే లోపే గుంతలు పడిపోతున్నాయని, డెల్టా ప్రాంతంలో సీసీ రోడ్లు వేయాలని ఆర్‌అండ్‌బి మంత్రిని కోరారు. అదేవిధంగా గ్రామాల్లో రోడ్లు వేస్తున్నా డ్రెయిన్లు లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోతుందని, అదేవిధంగా గ్రామంలో డంపింగ్ యార్డ్‌లు లేక చెత్త చెదారాలను ఎక్కడబడితే అక్కడ వేస్తున్నారని, ప్రభుత్వం వాటిపై దృష్టి పెట్టి, స్థల సేకరణ చేసి డంపింగ్ యార్డ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు.

పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) కోరారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఎంఎల్‌ఎ అంజిబాబు మాట్లాడారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, రైతుకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రైతు పండించిన పంట వాతావరణ విపత్తుల వల్ల నష్టపోవాల్సి వస్తుందని వాపోయారు. గత ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, నేడు రాష్ట్రంలో వ్యవసాయం చేసే రైతులకు గిట్టుబాటు ధర రాక సంతోషంగా లేరని అన్నారు. రైతు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని, ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి

తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాలయాలకు చెందిన స్థానికులకు మలేరియా, డెంగీ వంటి వ్యాధులపై అవగాహన కల్పించాలని తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు అన్నారు. గురువారం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో ఉన్న వైద్య సిబ్బంది స్థానికులకు రోగాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ల్యాబ్‌లో మలేరియా పరీక్షలు ఏవిధంగా జరుగుతున్నది అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. రెండవ సచివాలయంలో ఫీవర్ సర్వే, ఎన్‌సిడి సర్వే ఏవిధంగా చేస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారం పొడి శుక్రవారంగా పాటించాలని, ఇంటి పరిసర ప్రాంతాల్లో తడి లేకుండా చూసుకోవాలని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు మాట్లాడుతూ ఎఎన్‌ఎంలు, ఆశాలు ఇంటింటా జరిపే ఎన్‌సిడి స్కానింగ్ కార్యక్రమంలో స్థానికులు సహకరించాలని అన్నారు. అనంతరం మూడవ సచివాలయం వద్ద క్షయ వ్యాధిపై అవగాహనా ర్యాలీ నిర్వహించి వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు యు.ఎస్తేరు మేరీ, ఆర్.రమాదేవి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

'నేటి మహిళలే చైతన్య మూర్తులు'

భీమవరం టౌన్ : సమాజంలో దేశాభివృద్ధిలో పురుషులతో పాటు సమానంగా మహిళలు కూడా సహాయపడుతున్నారని, నేటి మహిళా మూర్తులే చైతన్య మూర్తులని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం జిల్లా సర్వోదయమండలి, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ మహిళ దినోత్సవ వారోత్సవాలలో భాగంగా సెయింట్ మేరీస్ హాస్పటల్లో డాక్టర్లు, నర్సులను సత్కరించి గుడ్డ సంచులను ఉచితంగా అందించారు. మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ 72 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సెయింట్ మేరీస్ వ్యవస్థలో నర్సులు, డాక్టర్లు అందిస్తున్న సేవలు అద్వితీయమని, పరిశుభ్రతలో కూడా ఈ ఆసుపత్రి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మహిళా సాధికారత-ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ నిర్వహించి, ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్న ఆరుగురు డాక్టర్లు, నర్సులు డాక్టర్.గ్రాసియా, డాక్టర్ సిమ్మి, డాక్టర్ సింధు, సిస్టర్ మేరీ, డాక్టర్ సెలీన్, ఎఐ సిస్టర్ రెజ్జిలను సత్కరించామని అన్నారు. 76 మందికి ఉచితంగా గుడ్డ సంచులను అందించామన్నారు. నిషేధ కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొల్లు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళా సాధికారత విభాగం, తెలుగు విభాగం, ఐక్యూ ఎసి ఆధ్వర్యంలో గురువారం తెలుగు సాహిత్య రూపకం నిర్వహించారు. మహిళా దినోత్సవ విశిష్టతను తెలిపారు. ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజరాజేశ్వరి అధ్యక్షతన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి, విశ్రాంత ప్రిన్సిపల్, ప్రభుత్వ కళాశాల చేబ్రోలు, గుంటూరు జిల్లా డాక్టర్ వి.సత్యవతి, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు, డాక్టర్ ఎం.లలిత కుమారి విచ్చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఐక్యు ఎసి కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామానికి చెందిన దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకటరామరాజు పేద కుటుంబానికి ఆర్థికసాయం చేయడానికి ముందుకొచ్చారు. కాళ్లకూరు గ్రామం వెంకటాపురంకు చెందిన బొక్కెన సీతమ్మ(70) అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందారు. సీతమ్మ మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు ముందుకు వచ్చారు. ఐదు వేల ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ సభ్యులు, సీతమ్మ కుమారుడు బుక్కెన శ్రీనుకి గురువారం అందజేశారు.

తాగునీరు, డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి

మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చిన స్థానికులు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని పలువార్డులలో మంచినీటి, డ్రెయినేజి సమస్య, దోమల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య దృష్టికి తీసుకు వచ్చి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. తక్షణం మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ సిబ్బందికి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలను జారీ చేశారు. దోమలను అరికట్టే చర్యల్లో భాగంగా ఫాగింగ్ మిషన్‌తో దోమలను అరికట్టే చర్యలు తీసుకుంటామన్నారు. తదుపరి మంచినీటి సమస్య, డ్రెయినేజి సమస్య వెంటనే పరిష్కార దిశగా అడుగులు వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం వార్డులో శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సానిటరి ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్, పాత్రుడు, సానిటరి మేస్త్రి కిషోర్, నరేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న అంజయ్య

డిగ్రీ కాలేజీకి ఎ గ్రేడ్

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో గురువారం 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించిన అకడమిక్ ఆడిట్ నిర్వహించినట్లు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి తెలిపారు. ఆడిట్‌ని ఏలూరు ప్రభుత్వ కళాశాలకు చెందిన కృష్ణచైతన్య, జంగారెడ్డిగూడెం ప్రభుత్వ కళాశాలకు చెందిన ఎం.మధు నిర్వహించినట్లు చెప్పారు. కాలేజీకి చెందిన అన్నిరకాల అకడమిక్ ఫైల్స్‌ను చూసి తమ కాలేజీకి ఎ గ్రేడ్ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు సిహెచ్.చైతన్య, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

8 నుంచి దండు మారెమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి - గణపవరం

ఈనెల 8 నుంచి గణపవరంలో దండు మారెమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ గురువారం తెలిపింది. ఉత్సవాలు 8వ తేదీ శనివారం నుంచి 16వ తేదీ వరకు జరుగుతాయని ఉత్సవ కమిటీ తెలిపింది. ఎనిమిది రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, 16వ తేదీ ఆదివారం అఖండ అన్నసమారాధన జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

CHANGE OF NAME

I, **RYALI ALIVELU MANGA CHAYA DEVI,** W/o R. VENKATA SIVARAMA KRISHNA PRASAD, resident of Door.No. 3-120, Sivalayam Street, Sivadevunichikkala, Palakol Mandal, West Godavari District. A.P., changed my name **RYALI MANGA DEVI,** (Old Name) to **RYALI ALIVELU MANGA CHAYA DEVI,** (New Name). Hence after all my documents, Passport ete., will continue with my new Name **RYALI ALIVELU MANGA CHAYA DEVI.**

పాస్‌పోర్ట్ పోయినది

కోనకళ్ళ వెంకట కృష్ణ, తండ్రి: వెంకటేశ్వర్లు, డోర్ నెం. 16-27, రేలంగి, గమళ్ళపాడు, ఇరగవరం మండలం, ప॥గో॥జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా

నేను వైజాగ్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి ది. 23-10-2022న **పాస్‌పోర్ట్ నెం. K8543238.** పాస్‌పోర్ట్ తీసుకున్నాను. నేను నా ఒరిజినల్ పాస్‌పోర్ట్‌ను తీసుకొని ది. 22-02-2025 తేదీన పాలకొల్లు మండలం, చింతపర్రులోని మా చిన్నమ్మ వద్దకు పాస్‌పోర్ట్ గురించి మాట్లాడటానికి వెళ్లినపుడు నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ జెరాక్స్ తీయడానికి వెళ్ళగా నేను వైజాగ్‌లో పొందిన నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పడిపోయింది. దారిలో ఎంత వెతికినను ఎక్కడా నాకు నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికితే నా పై అడ్రస్‌కు ఇవ్వాల్సిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

నా సెల్ నెంబర్: 80088 28994

మహారాజశ్రీ 7వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి
ప॥గో॥జిల్లా, ఏలూరు
ఎ.ఎస్.నెం. 72/2022

బిట్వీన్ :

మాదేటి వెంకట దుర్గా ఆనందరావు ...**అప్పీలెంటు**

మరియు

సమయమంతుల ముత్యాలరావు వగైరాలు

...రెస్పాండెంట్లు

పై నెంబరు గల అప్పీలు లో 5వ రెస్పాండెంటు అయిన సమయమంతుల సాంబశివరావు, S/o మల్లిఖార్జునరావు, CA, F-C-16 భరణి కాంప్లెక్స్, యన్.ఆర్.టి. స్టాట్యూట్ దగ్గర, మినిస్టర్ రోడ్డు, సికింద్రాబాద్, తెలంగాణ రాష్ట్రం వారికి పై కోర్టులో **ది. 26-03-2025 తేదిన ఉదయం 10:30 ని॥లకు** స్వయంగా కాని, లేదా ప్లీడరు గారి ద్వారా కాని హాజరయి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేని యెడల సదరు అప్పీలు తమ పరోక్షమున విచారణ చేయుదురని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
అడ్వకేట్సు, ఏలూరు
ఏలూరు జిల్లా

ఏలూరు
ది. 04-03-2025

గ్రామపంచాయతీ కార్యాలయము, చినకాపవరం

టెండరు ప్రకటన

తేది.06-03-2025

పశ్చిమ గోదావరి జిల్లా, ఆకివీడు మండలం, చినకాపవరం గ్రామపంచాయతీకి అవసరమైన కాంట్రాక్ట్ సిబ్బంది 2025-26 సంవత్సరమునకు ఈక్రింది వివరించిన ప్రకారము ది. 01-04-2025వ తేదీ నుండి ది. 31-03-2026 సంవత్సరము వరకు టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను ది. 13-03-2025వ తేదీ శుక్రవారం ఉదయం గం. 11.00 గ॥ల నుండి మధ్యాహ్నం 1.00 గం॥ల వరకు స్వీకరించబడి, అదే రోజు మధ్యాహ్నం 2.00 గం॥లకు టెండర్లదారుల సమక్షంలో తెరవబడును. గాన ఆసక్తి గలవారు సదరు టెండర్లు వేసుకొని పోస్టు ఒక్కంటికి రూ. 100/-లు ధరావత్తు చెల్లించి సదరు టెండర్లలో పాల్గొనవలసినదిగా కోరడమైనది. మిగిలిన వివరములు షరతులు కార్యాలయము పనిచేయు వేళలయందు అడిగి తెలుసుకోవచ్చును.

వ.నెం.	పనిపేరు	కావలిసిన వ్యక్తుల సంఖ్య
1	పారిశుద్ధ్యం నిర్వహణ (1) గ్రెన్ అంబాసిడర్స్ (2)	03
2	రక్షిత మంచినీటి సరఫరా పథకము నిర్వహణ PWS స్కీం పంపు ఆపరేటర్ మరియు ఆర్.హెచ్.ఎస్.ఓ.లు శుభ్రపరుచుటకు మరియు క్లోరినైజేషన్ పైప్ లైన్ రిపేర్ నిమిత్తం	03
3	వీధి దీపములు పనుల నిర్వహణ	01

టెండర్ దరఖాస్తు ఫారం మరియు టెండర్ దాఖలు చేయుటకు గానూ నియమావళి మరియు ఇతర విషయము కొరకు ఆఫీస్ పనిచేయు వేళలలో సంబందిత పంచాయితీ కార్యదర్శి గ్రామపంచాయితీ వారి నుండి పూర్తి వివరములు పొందగలరు.
నిధుల లభ్యతను బట్టి వేతనాలు చెల్లింపబడును.

సం/- **ఎమ్.పి.ఎన్. ప్రసాద్**
గ్రామపంచాయితీ కార్యదర్శి, చినకాపవరం, ఆకివీడు మండలం, ప॥గో॥జిల్లా.

గ్రామపంచాయతీ కార్యాలయము, అయిభీమవరం

టెండరు ప్రకటన

తేది.06-03-2025

పశ్చిమ గోదావరి జిల్లా, ఆకివీడు మండలం, అయిభీమవరం గ్రామపంచాయతీకి అవసరమైన కాంట్రాక్ట్ సిబ్బంది 2025-26 సంవత్సరమునకు ఈక్రింది వివరించిన ప్రకారము ది. 01-04-2025వ తేదీ నుండి ది. 31-03-2026 సంవత్సరము వరకు టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను ది. 12-03-2025వ తేదీ గురువారం ఉదయం గం. 11.00 గ॥ల నుండి మధ్యాహ్నం 1.00 గం॥ల వరకు స్వీకరించబడి, అదే రోజు మధ్యాహ్నం 2.00 గం॥లకు టెండర్లదారుల సమక్షంలో తెరవబడును. గాన ఆసక్తి గలవారు సదరు టెండర్లు వేసుకొని పోస్టు ఒక్కంటికి రూ. 100/-లు ధరావత్తు చెల్లించి సదరు టెండర్లలో పాల్గొనవలసినదిగా కోరడమైనది. మిగిలిన వివరములు షరతులు కార్యాలయము పనిచేయు వేళలయందు అడిగి తెలుసుకోవచ్చును.

వ.నెం.	పనిపేరు	సంఖ్య	ధరావత్తు
1	పారిశుద్ధ్యం నిర్వహణ (1) గ్రెన్ అంబాసిడర్స్ (3)	04	ఒక్కొక్కరికి రూ 100/-
2	రక్షిత మంచినీటి సరఫరా పథకము నిర్వహణ (మోటర్ స్విచ్ ఆపరేటర్ మరియు పైప్ లైను రిపైర్ మరియు ఓ.హెచ్.ఎస్.ఆర్.లు శుభ్రపరుచుటకు మరియు క్లోరినేషన్)	02	
3	వీధి దీపములు పనుల నిర్వహణ	01	

టెండర్ దరఖాస్తు ఫారం మరియు టెండర్ దాఖలు చేయుటకు గానూ నియమావళి మరియు ఇతర విషయము కొరకు ఆఫీస్ పనిచేయు వేళలలో సంబందిత పంచాయితీ కార్యదర్శి గ్రామపంచాయితీ వారి నుండి పూర్తి వివరములు పొందగలరు.
నిధుల లభ్యతను బట్టి వేతనాలు చెల్లింపబడును.

సం/- **ఎమ్.పి.ఎన్. ప్రసాద్**
గ్రామపంచాయితీ కార్యదర్శి, అయిభీమవరం, ఆకివీడు మండలం, ప॥గో॥జిల్లా.